వలస జీవుల వ్యథ

- ఆధార్, రేషన్ కార్డు సౌకర్యం లేని కాలనీవాసులు
- యనాది కాలనీలో 70 కుటుంబాలు
- మౌలిక వసతులు మృగ్యం!


యనాది కాలనీలో గృహాలు

నూజెండ్ల: అక్కడున్న వారంతా వలస జీవులే.. పనులు చేసుకుంటూ ఊరూ–వాడా తిరుగుతూ జీవనం సాగిస్తుంటారు. ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలనే ఆలోచనే లేదు. కనీసం ఆధార్ కార్డు సంగతే తెలియదు. రేషన్ కార్డు గురించి అసలే తెలియదు. ఓటు హక్కు వినియోగించుకున్న దాఖలాలు లేవు. ఇటువంటి వారి వివరాలు తెల్సుకోవాలంటే మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేదు. మండల కేంద్రమైన నూజెండ్లకు రెండు కిలోమీటర్ల దూరంలో కమ్మవారిపాలెం గ్రామ సమీపంలో 70 కుటుంబాలు ఉంటున్న యనాది కాలనీకి వెళితే బ్రతుకు జీవుల ఆవేదనలు వినిపిస్తాయి.

మౌలిక వసతుల లేమి

కమ్మవారిపాలెం సమీపంలోని యనాది కాలనీవాసులు ప్రభుత్వాలు అందించే కనీస సౌకర్యాలకు దూరంగా ఉంటున్నారు. సంఘంలో షుమారు 200 వరకూ నివసిస్తున్నారు. గతంలో జీవనోపాధికి ఊరూరా తిరిగే సంచార జీవితానికి ముగింపు పలికారు. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా అందరూ కలిసి పాకలు వేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నారు. కాలనీలో కనీస వసతులు లేక అరకొర సౌకర్యాలతో మగ్గిపోతున్నారు. తాము గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ స్థలానికి పట్టాలు మంజూరు చేయాలంటే ఆధార్, రేషన్ కార్డు కావాలంటున్నారని కాలనీ వాసులు గోడు వెళ్ళబోసుకుంటున్నారు. ఆధార్ కార్డు కోసం చేసిన ప్రయత్నాలు ముందుకు పోవటం లేదని, పుట్టిన తేదీ ధ్రువీకరణ కావల్సి ఉండటంతో ఆధార్ పొందలేక పోతున్నామని కాలనీ వాసులు అంటున్నారు. రేషన్ కార్డు కావాలన్నా, పిల్లలను చదివించుకోవాలన్నా ఆధార్ తప్పని సరికావడంతో సంక్షేమ పథకాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీ వాసులకు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేయించి శాశ్వత గృహ నిర్మాణాలు ఏర్పాటు చేయించేందుకు అధికారులుతో పాటు ప్రజాప్రతినిధులు తమవంతు కృషి చేయాల్సి ఉంది.

దుర్భర జీవితం



మా కాలనీలో సౌకర్యాలు లేక దుర్భర జీవితాన్ని గడుపుతున్నాం. ఆధార్ కార్డులు లేకపోవటంతో పిల్లల్ని చదివించుకోలేక పోతున్నాం. రేషన్ కార్డులు మంజూరు చేయిస్తే ప్రభుత్వ పథకాలు పొందగలుగుతాం.

–మల్లవరపు కామయ్య, కాలనీ వాసి

విషపు జంతువులతో ఇబ్బందులు



కాలనీలో గృహాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో విషజంతువులు బారిన పడుతున్నాం. వైద్య సదుపాయం అందటం లేదు. స్థానికులు సహకరించి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ సదుపాయాలు అందటం లేదు.

–పొన్నం సంజీవులు, యానాది కాలనీ వాసి

నివాసాలు మంజూరు చేయాలి



పథకాలకు ఆధార్ అడ్డంకిగా మారింది. ప్రతి ఒక్కరికీ ఆధార్, రేషన్‌కార్డు మంజూరు చేస్తే సంక్షేమ పథకాలు అందుకోవచ్చు. ప్రస్తుతం మా సొంత నిధులతో వారికి కొన్ని కనీస వసతులు కల్పిస్తున్నాం. అధికారులు స్పందించి కాలనీలోని కుటుంబాలకు ఆధార్, రేషన్ కార్డులతో పాటు శాశ్వత నివాసాలు మంజూరు చేయించాలి.

–గంగినేని బాబు, కమ్మవారిపాలెం మాజీ సొసైటీ అధ్యక్షుడు

మా కాలనీలో సెల్‌టవర్ నిర్మించవద్దు

ఎస్సీ కాలనీలో సెల్ టవర్ పనులను అడ్డుకున్న స్థానికులు


సెల్‌టవర్ నిర్మాణ పనుల్ని అడ్డుకున్న జాలాది ఎస్సీ కాలనీ వాసులు

యడ్లపాడు: మండలంలోని జాలాది ఎస్సీకాలనీలో ఇండస్ట్రీయల్ సెల్ టవర్ ఏర్పాటు వ్యవహారం వివాదంలో చిక్కుకుంది. ఇటీవల కాలంలో గ్రామంలోని ఎస్సీకాలనీ నివాసాల సమీపాన సెల్ టవర్ ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. అయితే స్థానికులు దీనిని వ్యతిరేకించడంతో కొద్దికాలం పనులు నిలిపివేశారు. తిరిగి అక్కడే పనులు ప్రారంభించడంతో కాలనీ వాసులంతా సదరు పనుల్ని అడ్డుకుని నిలుపుదల చేయించారు. ఈ విషయంపై సెల్‌టవర్ నిర్మాణ పనులు చూస్తున్న ప్రతినిధులు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కాలనీ వారుల తీరుపై ఫిర్యాదు చేశారు. తమ నిర్మాణ పనుల్ని తరచు అడ్డుకుంటున్నారంటూ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో శుక్రవారం రాత్రి కాలనీ వాసుల్ని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకతపై స్థానికుల నుంచి ఆరా తీశారు. స్థానికుల అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం మొదలు పెట్టారని కాలనీవాసులు పోలీసులకు తమ గోడు వినిపించుకున్నారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించిన విషయాన్ని పోలీసుల దృష్టికి తెచ్చారు. సెల్‌టవర్ ఏర్పాటు అనుమతికి సంబంధించి ప్రత్యేక జీవో ఉందని ప్రతినిధులు పోలీసులకు తెలిపారు. మూడు రోజుల్లోగా సంబంధిత అనుమతులు చూపించాలని పోలీసులు ప్రతినిధులను కోరారు. అప్పటి వరకు పనుల్ని నిలుపుదల చేయాలంటూ సూచించారు. దీంతో టవర్ నిర్మాణ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. వివాదం కాస్త సద్దుమణిగింది. ప్రస్తుతానికి వివాదం వాయిదా పడగా, ఇప్పటికే ఉన్న సెల్‌టవర్ వల్ల కాలనీ కుటుంబాల్లోని పలువురికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని వాపోయారు. అక్కడే మరో టవర్‌ను నిర్మించొద్దని గ్రామస్తులు తమ ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

యూట్యూబర్లను ప్రభుత్వం గుర్తించాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఘనంగా జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం


హాజరైన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని సన్మానిస్తున్న యూట్యూబర్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట: జర్నలిస్టులకు ఇచ్చే అక్రిడేషన్ లాంటి గుర్తింపు కార్డులు యూట్యూబర్ ఛానల్ ప్రతినిధులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో నిర్వహించిన పల్నాడు జిల్లా యూట్యూబర్ న్యూస్ చానల్స్ ఆఫ్ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో తాను యూట్యూబర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని అప్పటి కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు సూచించానని అన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేనిదే తామేమి ఇవ్వలేమని కలెక్టర్ చెప్పారన్నారు. అందువలన ప్రభుత్వమే దీనికి పూనుకోవాలని, గుర్తింపు కార్డులు ఉంటేనే సమాజంలో యూట్యూబర్లకు గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. యూట్యూబర్ల సమస్యలు తీర్చేందుకు తన వంతు సహాయసహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీగా తమపాత్ర పోషిస్తామన్నారు. అందరూ కలిసి ఉంటేనే బాగుంటుందని సూచించారు. ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ హాలుకు గత ప్రభుత్వంలో కృషి జరిగిందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. అసోసియేషన్ నూతన జిల్లా అధ్యక్షులుగా అనీల్, కార్యదర్శిగా షాహిద్, కోశాధికారిగా చలమయ్య తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. దీనిలో ఏపీ ఫౌండర్ ప్రెసిడెంట్ జి.మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వి.మధుసూధనరావు, ఏపీ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.అనీల్‌కుమార్, బండిశివ హాజరయ్యారు.

నిలిపివేసిన పింఛన్లు తక్షణమే ఇవ్వాలి

శావల్యాపురం: కూటమి ప్రభుత్వంలో అర్హత కల్గిన పింఛనుదారులు నగదు నిలుపుదల చేయటం మంచి పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి కొండలు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండలంలోని పోట్లూరు, కొత్తలూరు,పిచికలపాలెం గ్రామాల్లో కూటమి నేతల కావాలనే పింఛన్లు నిలుపుదల చేశారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలు– కుల మతాలకు అతీతంగా అర్హత కల్గియున్న లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిలుపుదల చేసిన పింఛన్లు తక్షణమే ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు తిరివిధి రమణారావు, అబ్బూరి అయ్యన్న, బోడెపూడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీలో మదర్స్ డే వేడుకలు



యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం అంగనవాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన మదర్స్ డే వేడుకలు హృదయాన్ని తాకేలా సాగాయి. ఈ సందర్భంగా చిన్నారులు తమ తల్లుల పాదాలకు వినయంతో నమస్కరించి, ప్రేమగా పూలు సమర్పించి సత్కరించారు. తల్లిదండ్రుల పాత్ర, వారి అమూల్యమైన త్యాగాలపై అంగనవాడీ కార్యకర్తలు శ్రద్ధగా పిల్లలకు అవగాహన కల్పించారు. తల్లులు తమ పిల్లలను ఆలింగనం చేసుకుని ఆశీర్వదించిన హృద్య క్షణాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పిల్లల అభిమానానికి తల్లులు భావోద్వేగంతో స్పందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.పున్నమ్మ, బి.అనురాధ, టి.సుధారాణి పాల్గొన్నారు.

ఘనంగా వీబీఎస్ వేడుకలు




వినుకొండ: స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో విరామ బైబిల్ పాఠశాల తరగతులు శనివారంతో ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న వీబీఎస్ తరగతులకు మొత్తం 16 సంఘాల నుంచి సండేస్కూల్ విద్యార్థులు దాదాపు ప్రతిరోజూ 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీబీఎస్ తరగతులకు బాప్టిస్ట్ సంఘానికి చెందిన సండే స్కూల్ టీచర్స్, సంఘస్తులు, వలంటీర్స్ కమిటీ సభ్యులు 80 మంది నిర్వహణలో పాల్గొన్నారు. చివరి రోజు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరి డా. జె.స్పర్జన్‌కుమార్, ఎమిలీ గ్రేస్, అధ్యక్షులు సీహెచ్. రామయ్య, సెక్రటరీ ఆశీ వందనం, ట్రెజరర్ పి. సునీల్‌కుమార్, వైస్ అధ్యక్షులు డి.నాగస్వామి, వినోద్, కె.సుందరరావు, మేరి షారోన్, మేరిరత్నం, వై.సునీత, కె.ఆశలత జీవన్, ఎం. విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మకతపై శిక్షణ



యడ్లపాడు: స్థానిక సామాజిక, సాంస్కృతిక వేదిక బాసట స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో గత నాలుగు రోజులుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ షేక్ ఝున్ను సాహెబ్ పాల్గొని విద్యార్థులకు చేతివ్రాతపై ఉచిత తర్ఫీదు అందించారు. ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు 300 మంది విద్యార్థులకు లుసిడా, ప్రింట్ హ్యాండ్ రైటింగ్ విభాగాల్లో అవగాహన కల్పించారు. అలాగే గ్రీటింగ్‌కార్డుల తయారీపై దార్ల నాగేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించిన వీరిని బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు, విద్యాకమిటీ చైర్మన్ కల్లూరి వాసు, కేతారామబ్రహ్మం, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, వేణు, రామకృష్ణ అభినందించారు.

ఐదు ఎకరాల గడ్డి వాములు దగ్ధం



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు ఎకరాల వరి గడ్డివాములు దగ్ధమై లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎగిటి ఆంజనేయులు, ఎగిటి వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ రెండు వాములు పక్కపక్కనే ఉన్నాయి. గడ్డివాముల నుంచి పెద్ద ఎత్తున మంటలు రావటం గమనించిన గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ మంటలను పక్కకు వ్యాపించకుండా గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకున్నారు. సమాచారాన్ని నరసరావుపేట అగ్నిమాపక అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట రూరల్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్ర ఆధ్వర్యంలో రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో 6వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ఈరోల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు శనివారం ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర యోగి గురూజీ ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి 7గంటల శిక్షణ శిబిరం జరుగుతుందని వివరించారు.

ఘనంగా దేవాలయాల పునఃప్రతిష్ట


హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

బొల్లాపల్లి : మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో శ్రీగంగా గౌరీశంకర, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల పునఃనిర్మాణంతో పాటు ఆయా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆయా దేవాలయాలను పలువురు దాతల సహకారంతో రూ.4.50 కోట్లతో పునఃనిర్మాణంతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాలు, గ్రామనడిబొడ్డున బొడ్రాయి ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు అంగరంగవైభవంగా సంప్రదాయంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో శివశంకర్ల పార్వతీదేవి, సుబ్రహ్మణ్య స్వామి, వీరభద్రుడు, కాళభైరవుడు, ఆంజనేయ స్వామి, వినాయక స్వామి, నాగేంద్ర స్వామి దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట చేశారు. ఉమ్మడి కడప జిల్లా బద్వేల్‌కు చెందిన సీతారామశాస్త్రి వేదపండితుల మంత్రోచ్ఛరణ, పూజా కార్యక్రమాలతో పునః ప్రతిష్ట కనులవిందుగా జరిగింది. ఈ ప్రతిష్టా కార్యక్రమంలో సుమారు 36 జంటలు పీటలమీద కూర్చుని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పునఃప్రతిష్ట సందర్భంగా ఆలయాలు సందర్శించి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

విద్యుదాఘాతంతో రైతు కూలీ దుర్మరణం



నాదెండ్ల: ఫ్యాను స్విచ్ వేస్తూ విద్యుదాఘాతమై రైతు కూలీ దుర్మరణం పాలైన సంఘటన కనపర్రులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొగిలి రమేష్ (36) భార్య విజయలక్ష్మి వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. స్నానం చేసి వచ్చిన తరువాత ఇంట్లోని ఫ్యాన్ స్విచ్ వేయడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతమై క్రిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు బాధితుడిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇరువురు కుమారులున్నారు.



వినుకొండ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి మూలవిరాట్ ప్రతిష్ఠాపన 82వ వార్షికోత్సవం సందర్భంగా 108 ఇత్తడి జల కలశములతో మహిళలచే అంగరంగ వైభవంగా పట్టణ పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. భారత్, పాకిస్థాన్ యుద్ధంలో భారత్ జవాన్లు విజయం సాధించాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. –వినుకొండ

విద్యుత్ తీగెలు సరిచేయమన్నా చేయడం లేదు!



నాదెండ్ల: గణపవరం గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో విద్యుత్ తీగలు క్రిందకు వ్రేలాడుతూ ప్రమాదభరితంగా మారాయి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన వజ్జా బ్రహ్మయ్య తన స్థలంలో అనుమతి లేకుండా విద్యుత్ లైను వేశారని, లైను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారాలు


సత్కారాలు పొందిన విద్యార్థులు

నరసరావుపేట రూరల్: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను లింగంగుంట్లలో శనివారం ఘనంగా సత్కరించారు. గ్రామ మాజీ సర్పంచ్, నరసరావుపేట కళావేదిక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పొన్నపాటి పేరిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాలలో 550 నుంచి 590 మార్కులు సాధించిన లింగంగుంట్లకు చెందిన 12 మంది విద్యార్థులను సత్కరించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో పొన్నపాటి ఈశ్వరరెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కందుల రామకోటిరెడ్డి, కేర్ స్కూల్ డైరెక్టర్ కె.కోటిరెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన అనుమకొండ రేవతి 590 మార్కులు సాధించి గ్రామ ప్రతిష్టతను పెంచారని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థినులను సత్కరించినట్లు వివరించారు. సత్కారం పొందిన పదవ తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధిస్తే ఆర్థిక పురస్కారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జాయింట్ కార్యదర్శి షేక్ బాజీ, కందుల విద్యాసాగర్ రెడ్డి, సరికొండ మురళీ, ఏలూరి మహేష్‌రెడ్డి, శనివారపు రామకృష్ణారెడ్డి, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

13వ రోజుకు చేరిన సీహెచ్‌వోల సమ్మె

వీరసైనికుడు మురళీనాయక్‌కు నివాళులు



నరసరావుపేట: పట్టణంలోని స్టేషన్‌రోడ్డు గాంధీపార్కుకు ఎదురుగా జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్ఓ)లు చేస్తున్న సమ్మె శనివారంతో 13వ రోజుకు చేరింది. ఆయుష్మాన్‌భవన్, రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో సీహెచ్‌వో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) జిల్లా అధ్యక్షురాలు అనుపమ కోరారు. సమ్మె శిబిరంలో ఆపరేషన్ సింధూర్‌లో వీర మరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. నాయకులు సాగర్, రాము, మస్తాన్ పలువురు సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

వీర మరణం పొందిన సైనికులు చిరస్మరణీయులు



నరసరావుపేట: దేశం కోసం ప్రాణాలు అర్పిస్తున్న సైనికులు చిరస్మరణీయులను పట్టణ రెండో సీఐ హైమారావు పేర్కొన్నారు. శని వారం లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మైనార్టీ హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్ నివాళులు అర్పించే కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కార్యదర్శి ఖాసీం పీరా, జిల్లా అధ్యక్షులు రఫీ, సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతకోసం పాటుపడిన శ్రామికుడు పీవీ రావు

నరసరావుపేట: దళితుల ఐక్యత కోసం నిరంతరం శ్రమించిన శ్రామికుడు స్వర్గీయ పీవీ రావు అంటూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ అన్నారు. శనివారం కార్యాలయంలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సేవా సామేలు, శిఖనం శ్రీను, గోదా నీలాంబరం పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకోసం పొర్లు దండాలు

నరసరావుపేట: పనిచేసిన అన్ని రోజులకు వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారంతో 52వ రోజుకు చేరింది. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మ వద్ద రోడ్డుపై బైఠాయించి మున్సిపల్ అధికారులు మనసు కరగాలని కార్మికులు పొర్లు దండాలు చేశారు.

సంక్షిప్త వార్తలు

పిడుగుపాటుకు గడ్డివామి దగ్ధం

శావల్యాపురం: చేతికి అందివచ్చిన వరి పంట పిడుగుపాటుకు దగ్ధమైన సంఘటన మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చేకూరి శ్రీనివాసరావుకు చెందిన ఎకరా వరి పంట కోత కోసి పొలంలో గూడు వేశాడు. అయితే శనివారం సాయంత్రం ఈదురు గాలులుతో కూడిన వర్షం కురిసింది. ఇదే సమయంలో వరి గూడు పిడుగుపాటుకు గురై మంటలు వ్యాపించాయి. సమీపంలోని వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో అగ్నిమాపక దళం వచ్చినప్పటికీ సంఘటనా స్థలానికి వెళ్ళే దారి లేకపోవటంతో మంటలు అదుపులోకి తేలేకపోయామని అగ్నిమాపక అధికారి బి.నాగేశ్వరావు తెలిపారు.. సుమారు 50 వేల రూపాయల పంట నష్టం వచ్చిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

కాల్వల ఆధునికీకరణ పనులకు ప్రాధాన్యత

రొంపిచర్ల: సాగునీటి కాలువల ఆధునీకరణకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్ల సమీపంలోని తంగేడుమల్లి మేజర్ కాల్వ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇంటూరి ప్రసాదు, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, పునుగోటి సాంబశివరావు, గాడిపర్తి రామాంజనేయులు, గడిపూడి నరసింహారావు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి విరాళం

చిలకలూరిపేట టౌన్: విద్యా సంస్థకు ఆర్థిక సహాయం అందించడం శుభ పరిణామమని చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని సాంబశివనగర్‌కు చెందిన కాకుమాను పుల్లారావు, కాకుమాను వెంకటనర్సమ్మ గత 40 సంవత్సరాలుగా డీఆర్ఎస్ఎస్ పీవీఎస్ కాలేజీలో నాన్ టీచింగ్ సిబ్బందిగా 40 సంవత్సరాలు పనిచేసి ఇటీవల కాలంలో రిటైర్ అయ్యారు. పనిచేసిన కళాశాలకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని శనివారం పట్టణంలోని విద్యా సంఘ కార్యాలయంలో రూ. లక్ష నగదు విరాళంగా అందించారు.